
# అహ నా ఇల్లు అంట



ముందు ప్రసూనాంబ చూసిందా ఇంటిని. చూడ్డంతోనే ఆమెకు ఆనందంతో గుండె ఆగిపోయినంత పనయింది. "అబ్బ! ఎంత ఆర్ధంగా ఉల్దో ఈ ఇల్లు" అనుకుందామె తెగ మురిసిపోతూ. ఆ అందమైన ఇంటిపైన అంతకంటే అందంగా అంతకంటే మురిపాలతో రాసి ఉన్న అక్షరాలు వేగంగా కొట్టుకుంటూన్న గుండెతో చదివిందామె.

"ఇదే– ఇదే మీరు కలలు కంటున్న స్వప్న మందిరం! పదేపదే మీ సొంతం కాబోతూన్న సొంత గృహం" ఆ తరువాత మేటర్ కూడా చకచకా చదివేసిందామె.

"కేవలం భారత ప్రజల మీద కక్కుకు చచ్చేంత ఎక్కువ ప్రేమ పొంగి పొరలటం వల్ల 'హెూమ్ లోన్' పథకాన్ని మా పబ్లిక్ సెక్టర్ బ్యాంక్ వారు ప్రాంరభిస్తున్నారు. మేమిచ్చే రుణ సహాయంతో నేడే ఈ పథకం చేపట్టి మీరు ఎప్పటినుంచో కలలు కంటూన్న స్వప్న గృహాన్ని సొంతం చేసుకోండి!

ఆలసించిన ఆశాభంగం!

ఎల్లప్పుడూ భారత ప్రజలను వదలకుండా వెంటాడి, వేటాడి సేవలు చేసే బ్యాంక్ మా బ్యాంక్" అంతవరకూ చదివేసరికి ప్రసూనాంబ ఇంక ఉండలేకపోయింది. ఆ న్యూస్ పేపర్ పట్టుకుని గాల్లో తేలిపోతున్నట్లు నడుస్తూ రామ్‌గోపాల్ గదికి చేరుకుంది. రామ్‌గోపాల్ కూడా ఆ ప్రకటన చూసి త్రిల్ అయాడు.

"ఇయాళ్రేపు మన గవర్నమెంట్ జర అకల్ తోటి పనిచేస్తున్నదే! మనసంటి పబ్లిక్‌కి మదద్ జెయ్యనికి జబర్దస్త్ స్కీమ్‌లు షురూ జేస్తున్నది" అన్నాడు ఆనందంతో పొంగిపోతూ.

"అయితే, ఆలస్యం ఎందుకండీ! మనం ఈ దిక్కుమాలిన ఏరియాలో ఫ్లాట్ కొని ఆరేళ్ళయిపోతోంది. ఇల్లు కట్టుకోడానికి డబ్బులేక ఈ పాడు అద్దె కొంపలో ఆ ఓనర్‌గాడి సర్వ చాదస్తాలకూ తల ఒగ్గి, చేతులు కట్టుకుని నిలబడి నానా అవస్థలూ పడుతున్నాం. మన మధ్య తరగతి వాళ్ళ పాలిట కల్పతరువులా పాపం ఈ బ్యాంక్ వాళ్ళెవరో ఇల్లు కట్టుకోడానికి అప్పు ఇస్తామంటున్నారు."

రామ్‌గోపాల్ ఒక్క క్షణం ఆలోచించాడు.

"అంటే ఇయాళ్నే బ్యాంక్‌కి బోమంటావా?" అడిగాడు సందేహంగా.

"అవునండీ! రాక రాక ఛాన్స్ వచ్చింది. దీన్ని వదులుకుంటే ఎలా?"

"మరి నా ఆఫీస్?"

"ఇవాళ సెలవు పెట్టేయండి! సొంతానికి ఓ ఇల్లు ఏర్పడుతోంటే ఆఫీస్ ఓ రోజు ఎగ్గొడితేనేం?"

ఆమె చెప్పిన మాట నిజమేననిపించింది రామ్‌గోపాల్‌కి.

అప్పటికప్పుడే వాళ్ళ ఆఫీస్ సూపర్నెంట్‌కి టెలిఫోన్ బూత్‌లో నుంచి ఫోన్ చేశాడతను.

"సార్! నేను రామ్‌గోపాల్‌ని మాట్లాడుతున్నాను" అన్నాడు. అవతలి గొంతు హలో అనగానే

"ఎస్? రామ్‌గోపాల్!"

"నేను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కెళ్ళి మాట్లాడుతున్నా సార్. హెల్త్ ఖరాబున్నదని ఈడికొచ్చినా! ఒక్కదినం లీవ్ శాంక్షన్ జేయాల్సార్."

"నో ప్రాబ్లెమ్ రామ్‌గోపాల్! తీసుకో! కానీ, గవర్నమెంట్ హాస్పిటల్‌కి పోయినోండ్లకు ఒక్కదినం ఏం సరిపోతది? వాలంటరీ రిటైర్మెంట్‌కి అప్లయ్ జేసి నీ జాబ్ మీ మిసెస్‌కి ఇప్పియ్యనుండె! గట్ల జేస్తే నువ్ వాపస్ అచ్చినా రాకున్నాగానీ నడిచిపోతది."

రామ్‌గోపాల్ గతుక్కుమన్నాడు.

"నాకు మరీ సీరియస్ ప్రాబ్లెమ్ లేద్సార్! జరంత సర్ది జేసిందన్నట్లు- అంది ఇస్నోఫీలియానా కాదా అని టెస్టింగ్ జేయిపించాలె! గంతనే!"

"ఓకే రామ్‌గోపాల్! వన్ డే లీవ్ శాంక్షన్డ్."

"థాంక్యూ సర్."

ఇంటికి చేరుకుని త్వరత్వరగా రెడీ అయి ఇద్దరూ న్యూస్‌పేపర్లో ప్రకటన ఇచ్చిన ఆ బ్యాంక్‌కి చేరుకున్నారు. మేనేజర్ చుట్టూ అరడను మంది మూగి వున్నారు. అందరితోనూ ఒకేసారి మాట్లాడుతున్నాడతను.

"సీతారామ్! మాకు అయిదు లక్షలు ఫిక్సుడ్ వేస్తామన్నారుగా- దాని సంగతే మయింది?"

"వేస్తాన్సార్! తప్పకుండా వేస్తా! మా వాడి లోను సంగతే మయింది మరి?"

"ఇంకో రెండు నెలల ఆగండి. ప్రస్తుతం క్రెడిట్ స్క్వీజ్ ఉంది. ఆ! మీకేం కావాలి?" రామ్‌గోపాల్ వంక చూస్తూ అడిగాడు.

"అదేనండీ! హోమ్‌లోన్ అనే స్కీమ్- మా మిడిల్ క్లాస్ వాళ్ళ గురించి తీసిన్రని పేపర్ల చదివినా! దాని గురించి...."

ఓ- అదా! వెరీగుడ్! కూర్చోండి! నిజం చెప్తున్నా కదా! మిడిల్ క్లాస్ వాళ్ళ పాలిట ఈ స్కీమ్ ఒక వరం అనుకోండి. ఆc- "మీకేం కావాలండీ!" ఇంకొకతనిని అడిగాడు.

"ఓడీ కావాల్సార్! లేకపోతే ఆరు చెక్కులు బౌన్స్ అయిపోతాయ్. క్లర్క్ మిమ్మల్ని అడగమంటున్నాడు."

"అలాగా! మీ షాప్‌లో అయిలాఫ్ అని ఏదో కొత్త కోల్డ్ క్రీమ్ వచ్చిందంటగా? మా అమ్మాయ్ అది కావాలని అడుగుతోంది. ఒక బాటిల్ శాంపుల్ పంపుతే...."

"ఇప్పుడే తెచ్చిస్తాన్సార్!"

"వెరీగుడ్! అయితే, ఓడీ తీసుకోండి. ఆ క్లర్క్‌కి నేను చెప్పానని చెప్పండి. ఆం– మీ పేరేమన్నారు?" మళ్ళీ రాంగోపాల్‌వేపు తిరగాడతను–

"రామ్‌గోపాలండి"

"రామ్‌గోపాల్ గారూ! మీరు చెయ్యాల్సిందేమిటంటే, వెంటనే హోమ్‌లోన్ ఎకౌంట్ మా బ్యాంక్‌లో ఓపెన్ చేయండి! నెలకు వెయ్యి, రూపాయలు చొప్పున మాకు ఏడేళ్ళపాటు మీరు కట్టాలన్నమాట. కడితే మేము మీకు ఆ డబ్బుకు డబుల్ ఎమౌంట్ లోన్‌గా ఇస్తామన్న మాట... ఏడేళ్ళ తర్వాత!"

రామ్‌గోపాల్, ప్రసూనాంబ ముఖాలు చూసుకున్నారు.

"మీరు నేను చెప్పింది సరిగ్గా అర్థం చేసుకోలేదనుకుంటానండీ– మేము ఇల్లు కట్టుకోడానికి డబ్బులేక లోన్ కోసం వచ్చామండీ.

"తెలుసండీ! అందుకే హోమ్‌లోన్ ఎకౌంట్ తెరవమంటున్నాను."

"కానీ, మేము లోన్ కావాలని అడుగుతూంటే ఏడేళ్ళపాటు మీరు మమ్మల్ని పైసలు కట్టమంటున్రేమిటి?"

"అదంతేనండీ! మేము ప్రజల క్షేమం కోసం, లాభం కోసం ఏ స్కీమ్ ప్రారంభించినా ఇలాగే ప్రజలకు లాభపడే విధంగా ఉంటాయ్ అన్నమాట. మీకేం కావాలండీ?" ఇంకొకతనిని అడిగాడు మధ్యలో.

"నాకు ఇంకో లాకర్ ఇస్తానన్నారు. దాని విషయం మాట్లాడదామని–"

"నాకు పాత చింతపండు పంపిస్తానన్నారు. దాని సంగతేమిటి?"

రామ్‌గోపాల్, ప్రసూనాంబ దిగాలుపడి ఇంటికి చేరుకున్నారు.

"ఇగో ప్రసన్నా! నేన్జెపుతున్నా ఇను– మనదేశంలో మిడిల్ క్లాసోడికి సాయం జేసేటోడె వ్వడూ లేడు. ఎరుకనా? ఉన్నోడూ, లేనోడూ అందరూ దుబాయించెడిది మిడిల్ క్లాసోడినే. మనం ఈ జన్మల ఇల్లు కట్టలేము" అన్నాడు రామ్‌గోపాల్. ఇన్‌స్టాల్‌మెంట్‌లో ముచ్చటపడి కొనుక్కున్న టేప్ రికార్డర్ ఆన్ చేస్తూ.

ముకేష్ పాట మొదలుపెట్టాడు–– "కహతా హై జోకర్ సారా జమానా–"

రామ్‌గోపాల్‌కి ఆ పాట ఎన్నిసార్లు విన్నా ఎక్కడలేని ఆనందం కలుగుతుంది. అది మిడిల్ క్లాస్– వాడి మీదే రాసినట్లనిపిస్తుందనికి.

ప్రసూనాంబ చుట్టుపక్కల వాళ్ళందరికి ప్రకటనల ద్వారా బ్యాంక్ వాళ్ళు చేస్తున్నన మోసం గురించి చెప్తోంది.

"అవునండీ! మొన్న ఆ మధ్య మా వారు కూడా ఇలాగే ఆ క్రెడిట్ కార్డ్ పబ్లిసిటీ బోర్డులు సిటీబస్ వెనక చూసి ఆ కార్డ్ కోసం బ్యాంక్ కెళ్ళారు. ఓ రోజు ఆఫీస్‌కి

సెలవుపెట్టి, తీరా వెళ్ళాక మీరు ఆరు నెలలపాటు ఎకౌంట్ ఓపెన్ చేసి మెయింటెయిన్ చేస్తే తప్ప కార్డ్ ఇవ్వం అన్నారు. సర్లేగదాని ఎకౌంట్ ఓపెన్ చేసి ఆరునెలల తర్వాత వెళితే అప్లికేషనలు రాయించుకుని క్రెడిట్ కార్డ్ మీకు ఇవ్వలేనందుకు చింతిస్తున్నాం అంటూ లెటర్ రాశారు" అంది సావిత్రమ్మ గారు.

"మమ్మల్నీ ఇంకో బ్యాంక్ వారిలాగే మోసం చేశారు అక్కయ్యగారూ, మా వారు నానా తిప్పలూ పడి ఎకౌంట్ ఓపెన్ చేసి క్రెడిట్ కార్డుకి అప్లయ్ చేస్తే "ఇవ్వలేనందుకు చింతిస్తున్నాం" అంటూ ఉత్తరం రాశారు" అంది రాజేశ్వరి.

"అన్నీ దొంగ బ్యాంకులు, మోసం ప్రకటనలు" అంది పార్వతీ దేవి.

అప్పుడే ఇంటి ఓనర్ స్కూటర్ మీద గేటు ముందాగి "వచ్చే నెల నుంచీ అద్దె ఎనిమిది వందలకు పెంచుతున్నా" అనేసి వెళ్ళిపోయాడు.

మర్నాడు న్యూస్ పేపర్ చూస్తూనే కెవ్వున కేకవేసింది ప్రసూనాంబ ఆనందంతో, రామ్‌గోపాల్ ఉలికిపడి నిద్రలేచాడు.

"ఏమండోయ్! ఇది చూశారా! ఇదేదో హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అంట వెంటనే ఇల్లు కట్టుకోడానికి అప్పు ఇస్తామంటున్నారు."

రామ్‌గోపాల్ ఆత్రుతగా చదివాడా ప్రకటన. పూర్తిగా చదివేసరికి అతను నిరాశపడిపోయాడు.

"నేన్జెప్పలే ఇందులో ఏదో మతలబ్ ఉంటదని! వాళ్ళు ఏమంటున్రో ఎరుకనా! ముందు మనం పాతిక వేలు డిపాజిట్ కట్టాల్నంట. తర్వాత ఆడు లోన్ ఇస్తాడంట! ఒక్కసారి మన పైసలు ఆడి చేతిలో పడినాంక ఇంక ఆడి చేతిల మనం తోలుబొమ్మలే కదా! ఆడెట్టాడిపిస్తే అట్లాడాలె."

ప్రసూనాంబకు కోపం వచ్చింది.

"అన్నీ అట్లా అనుకుంటే ఎలా? మనం ఇంకెప్పటికీ ఇల్లు కట్టలేము. నా మాట విని ఒక్కసారి వెళ్ళి వివరాలు కనుక్కురండి."

"ఇదిగో మాట్లాడితే సెలవు పెట్టనికి నా తోటిగాడు."

ప్రసూనాంబకు కోపం వచ్చేసింది. కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"నాకు ముందే తెలుసు, మీ నిజామాబాద్ జిల్లా వోళ్లు ఇలాగే అంటారని! మా నాన్నగారు అంటూనే ఉన్నారు– మన ఖమ్మం జిల్లావోళ్ళకి, నిజామాబాద్ జిల్లా వోళ్ళకి కుదర్దే! మన మెంటాలిటీ వేరు, వాళ్ళ మెంటాలిటీ వేరు అని! కానీ, మా అమ్మే వినిపించుకోకుండా కాళ్ళ దగ్గర కొచ్చిన బంగారంలాంటి వరంగల్ సంబంధం కాదని మీ సంబంధం అంటగట్టింది!"

ఆ మాటతో రామ్‌గోపాల్‌కి కోపం ముంచుకొచ్చింది.

"అంటే, మా నిజామాబాదోండ్లం చిల్లరగాండ్లమా?"

"అవును. ముమ్మాటికీ చిల్లరగాళ్ళే! లేకపోతే సొంత భార్య మాట ఎవరయినా కాదంటారా?"

"మా అమ్మ గూడా ఖమ్మం పోరిలను జేసుకోకురా బిడ్డా అని మొత్తుకుంటుండెగానీ, నేనే మీరు మా నాయన్తాలాకు బంధువులని, కాదంటే మా నాయన దిల్ దు:ఖాయిస్తదని జేస్కోనికి వప్పుకున్నా. ఇప్పుడు జూడు– బరాబర్ మా అమ్మ జెప్పినట్లే అవుతున్నది. పెండ్లయిన దినం కెళ్ళి ఒకటే కిరికిరి, ఒకటే లొల్లి."

కొద్దిసేపు ఇద్దరూ గొడవపడ్డాక మామూలుగానే రాజీపడ్డారు.

బ్యాంకులో ఇద్దరు పిల్లల కోసం వేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇరవై వేలు తీసికెళ్ళి ఆ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో డిపాజిట్ చేసి ఇంటి లోన్ తీసుకోవాలని నిర్ణయించు కున్నారు. తీరా ఆ ఆఫీసుకు చేరుకునేసరికి ఆఫీస్ బయట కొన్ని వందలమంది గుమికూడి కనిపించారు. పెద్దగా అరుపులు, కేకలు వినబడుతున్నాయ్. కొంతమంది నేలమీద కూలబడి బిగ్గరగా ఏడ్చేస్తున్నారు. ఏడుస్తున్న వారిలో ఓ గొంతు విని ఠక్కున గుర్తుపట్టాడు రామ్‌గోపాల్.

"ఆ గొంతు మా ఆఫీస్‌లో పనిజేసే శ్రీనివాస శాస్త్రిదే. పద" అంటూ జనాన్ని తోసుకుంటూ అతని దగ్గరకు చేరుకుని తనూ నేలమీద కూర్చున్నాడు.

"ఏమాయె శ్రీనివాస్! ఏడుస్తున్నావేం సంగతి?"

శ్రీనివాసశాస్త్రి అమాంతం రామ్‌గోపాల్‌ని కౌగిలించుకొని మళ్ళీ బోరుమని ఏడ్చేయటం ప్రారంభించాడు.

"ఏం చెప్పను గురూ! నేను ఇంటి లోన్ కోసమని యాభయ్ వేలు డిపాజిట్ కట్టాను. ఆరునెలల్లో లోన్ ఇస్తానన్నాడు. అయిదు నెలలవంగానే అందరి డిపాజిట్లు తీసుకుని తమిళనాడుకు పారిపోయాడు"

రామ్‌గోపాల్ గుండె ఝల్లుమంది.

"అదేమి? మంది పైసల్దీసుకుని పోతూంటే గవర్నమెంటేం జేస్తున్నది? అట్లాంటోళ్ళకు ఇట్ల డిపాజిట్లు కలెక్టు జేసేందుకు పర్మిషనెట్లిచ్చిన్రు" అడిగాడు ఆశ్చర్యంగా.

"గీబాడుకవులూ– గవర్నమెంట్ బాడుకవులూ కుమ్మక్కై మందిని ముంచిన్రు దేముడో– గిప్పుడు నాకేం దిక్కు దేముడో–"

"ఊరుకో శాస్త్రీ. ఏడిస్తే ఏం లాభం?"

"అమ్మో! నా యాభయ్ వేలు– అవి కష్టపడి సంపాదించిన పైసలయితే అట్లాగే ఊరుకునేవాడిని. కానీ, అవన్నీ ఆఫీసులో లంచాలు తీసుకుని సంపాదించిన డబ్బు.

లంచాలు తీసుకోవడమంటే మాటలా? ఎంత రిస్క్ ఉంటుందందులో? పైదాకా ఎవడికి సరిగ్గా వాటాలందకపోయినా మొత్తం తప్పి ఆఖరికి నాలాంటి గూమాస్తాగాడినే మటాష్ చేసేస్తారు. ఓరి దేముడో! అంత రిస్క్ తీసుకుని సంపాదించిన డబ్బుకే ఎసరు పెట్టాడే వీడు. కష్టార్జితం అయినా పోతే పోయిందని ఊరుకునే వాడిని దేవుడా!"

ప్రసూనాంబ ముఖం పాలిపోయింది.

"పదండి, ఇంటికెళదాం" అంది దిగులుగా.

ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు మళ్ళీ మళ్ళీ టేప్‌రికార్డర్ ఆన్ చేశాడు రామ్‌గోపాల్ పడక కుర్చీలో కూర్చుని.

"కహతా హై జోకర్ సారా జమానా..." పాట వినబడుతోంది.

బయట స్కూటర్ హారన్ మోగింది. ఇంటి ఓనర్ ఇంజన్ ఆఫ్ చేయకుండానే మాట్లాడాడు.

"ఈనెల నుంచీ అద్దె ఎనిమిది వందలు. గుర్తుందో లేదోనని వార్నింగివ్వటానికొచ్చా" అనేసి వెళ్ళిపోయాడు. రామ్‌గోపాల్‌కి కోపం వచ్చేసింది.

"ఎనిమిది వందలు– ఈ ఫాల్తూ ఇంటికి ఎనిమిది వందలా? నేనివ్వ! ఏడొందల కంటే ఒక్కపైస గూడా ఎక్కువివ్వ" అని గావుకేక వేశాడు.

ఆ రాత్రి అతనికి జ్వరం వచ్చింది. ప్రసూనాంబ కన్నీరు పెట్టుకుంది "మీ నిజామాబాద్ జిల్లా వోళ్ళు ఇలాగే ఆవేశపడి కొంపలు మీదకు తెచ్చుకుంటారని మా న్నాగారు ముందే చెప్పారండీ" అంది జాలిగా.

"చూడండీ! అనవసరంగా డాక్టర్‌కి యాభై కట్టాల్సి వచ్చింది. ఎంత నష్టం? అదే ఇంటికి ఓ కిటికి వచ్చేది"

మర్నాడు ఆఫీసు కెళ్ళేసరికి గుమాస్తాలందరూ రామ్‌గోపాల్ చుట్టూ మూగిపోయారు.

"కంగ్రాచ్చులేషన్ గురూ" అన్నాడు రామానుజాచారి.

"ఎందుకు? నాకు ప్రమోషన్ ఏమైనా వచ్చిందా?" ఆశగా అడిగాడు రామ్‌గోపాల్.

అందరూ ఆ జోక్‌కు పగలబడి నవ్వారు.

"బలేవాడివేలే, సెంట్రల్ గవర్నమెంట్‌లో ప్రమోషనా? ఇంకా నయం! నీకు ఇంటిలోన్ శాంక్షన్ అయినట్లు లెటర్ వచ్చింది." దభేల్‌మని కిందపడ్డాడతను.

రామ్‌గోపాల్‌ను స్పృహ తప్పిన మిగతావాళ్ళ పక్కన పడుకోబెట్టారు వాళ్ళు. సాయంత్రా నికల్లా అందరూ లేచి కూర్చున్నారు.

"అదేమిటి?" సెంట్రల్ గవర్నమెంట్ హౌసింగ్ లోన్ శాంక్షన్ అవదుగా అసలు?"

"ఎక్కడో ఏదో పొరబాటు జరగడం వల్ల లోన్ శాంక్షన్ అయుంటుందని మన బాస్

కూడా అన్నారు. నువ్వు ఆలస్యం చెయ్యకుండా వెంటనే డాక్యుమెంట్స్ అన్నీ ఇచ్చేసి లోన్ తీసేసుకో. లేకపోతే ఓ క్షణంలోనైనా ఎర్రర్ రిగ్రెటెడ్ అని టెలెక్స్ మెసేజ్ రావచ్చు–"

రామ్‌గోపాల్ మెరుపువేగంతో బయటకు పరుగెత్తాడు. వారంరోజుల్లో ఇంటి లోన్ తాలూకా చెక్కు తీసుకొచ్చి ప్రసూనాంబకు చూపించాడతను. ప్రసూనాంబ కన్నీరు పెట్టుకుంది.

"మా నాన్నగారు ఈ మాట కూడా ముందే చెప్పారండీ! నిజామాబాద్ జిల్లా వోళ్ళు అనుకున్నది ఎప్పటికైనా సాధిస్తారని, ఆ ఒక్కటీ వాళ్ళ దగ్గర మంచి గుణం ఉందని అంటూండేవాళ్ళు" అంది ఆనందంగా.

ఆ మర్నాటినుంచీ నెల రోజులు సెలవుపెట్టి ఇంటి పని ప్రారంభించాడతను. పొద్దున్నే తన మోపెడ్ వేసుకుని తాపీ మేస్త్రీ ఇంటికి చేరుకున్నాడు. ఎవడో ఇల్లు కట్టిన ఫ్రెండ్ ఇచ్చాడా అడ్రస్. ఓ పెంకుటిల్లది. ఇంటి ముందున్న జీప్ అప్పుడే స్టార్టయింది. ఫ్రంట్ సీట్లో కూర్చున్న వ్యక్తి జీప్ ఆపించి, రామ్‌గోపాల్ వేపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎవళ్ళు గావాల్సార్?"

"అంజయ్య మేస్త్రి"

"నేనే సార్! ఏం గావాలి?"

"మా ఇల్లు కట్టాల"

అతను జేబులోనుంచి ఓ కాగితం తీసి రామ్‌గోపాల్ కిచ్చాడు.

"అది నా రేట్స్ కొటేషన్ సార్! సరేననుకుంటే నాకు ఫోన్ జేయండ్రి! రేపే పని షురుజేస్త. ఇంటి ఫోన్ నెంబర్ కూడా అందులోనే రాసున్నది"

అతని జీప్ వెళ్ళిపోయింది.

రామ్‌గోపాల్ నిశ్చేష్టుడైపోయాడు.

తాపీ మేస్త్రీ ఒక జీప్ మెయింటెయిన్ చేస్తున్నాడా? అతనింటికి ఫోన్ కూడా ఉందా? మోపెడ్ స్టార్ట్ చేసుకుని వడ్రంగి మేస్త్రీ ఇంటికి చేరుకున్నాడు. అతని భార్య తలుపు తీసింది.

"వడ్రంగి మేస్త్రీ ఉన్నాడామ్మా?"

"లేడు. ఎయిర్‌పోర్ట్‌కి పోయిండు"

"ఎయిర్ పోర్టుకా? ఎందుకు? అక్కడేమయినా వడ్రంగి పని చేస్తున్నాడా?"

"కాదొసార్! మా పోరడు పెద్ద సదువులకు అమెరికా పోతుండు. సెండాఫ్ ఇయ్యడానికి పోయిండు."

రామ్‌గోపాల్‌కు మతి పోయినట్లయింది.

“సరే! అయితే మళ్ళీ వస్తాలే. నేను ఇల్లు కడుతున్నా! దానికి కార్పెంటరీ పని గురించి మాట్లాడాని కొచ్చినా”

“ఏ టైమ్ కొస్తవో జెప్తే బుక్‌లో రాస్తా సార్! లేకుంటే ఇంటి దగ్గరుండడు. చాలా బిజీగుంటడు.”

“అట్లనా! దినాలట్లున్నయ్, సాయంత్రం ఆరు గంటల కొస్తానన్జెప్పు”

“ఈ బుక్‌లో టైమూ, నీ పేరూ అడ్రసూ రాయ్ సార్”

రామ్‌గోపాల్ పుస్తకంలో రాసిచ్చాడు.

మర్నాడు పని ప్రారంభమైపోయింది. కూలీలు వచ్చి పునాదులు త్రవ్వడం ప్రారంభించారు. వాళ్ళందరికీ సాయంత్రమయ్యేసరికి కూలీ డబ్బు ఇస్తోంటే చాలా గర్వంగా, ఓ విధమైన థ్రిల్లింగ్‌గా ఉందతనికి. ఎప్పుడూ కాషియర్ ముందు నిలబడి జీతం తీసుకోవడం, ఆఫీసర్ ముందు చేతులు కట్టుకుని నిలబడి చెప్పిన పనులు చేయడమేగానీ, పదిమందిని ఆజ్ఞాపించే అవకాశం, వాళ్ళకు జీతాలిచ్చే స్టేటస్ అనుభవించలేదు.

మామూలుగానే ఇంటికి స్లాబ్ పడేసరికి అతనికి శాంక్షన్ అయిన లోన్ అంతా ఖర్చయిపోయింది.

“అదేమిటండీ! ఇల్లంతా పూర్తవడానికి సరిపోయేంత లోన్ ఇచ్చారు కదా వాళ్ళు? అప్పుడే ఎలా ఐపోయింది?” గాబరాగా అడిగింది ప్రసూనాంబ.

“మనం లోన్ అప్లయ్ చేసి ఐదేండ్లయిపాయె. అప్పటి బడ్జెట్ ప్రకారమైతే సరిపోతుండే కానీ, ఇప్పుడు ఇంటికి కావల్సిన వస్తువుల ధరలన్నీ డబుల్ ఐపాయె. ఇంకేడకెళ్ళి సరిపోతది?

“మరిప్పుడేం చేద్దాం? మధ్యల అపుతే అటూ ఇటూ కాకుండా ఐపోతాం గదండీ! జీతంలో ఇంటి అప్పు తెగుతూంటుంది. ఇటు ఇంటి అద్దెకూడా కట్టుకుంటూండాలి”

ఇద్దరూ రాత్రంతా నిద్రలేకుండా ఆలోచించారు. ఉదయం ఆమె మెడలో నగలన్నీ బ్యాంక్‌కు తీసుకెళ్ళాడతను.

“నగలు తాకట్టు పెట్టుకోవటం మానేశాం. గోల్డ్‌లోన్ మీద బాన్ ఉంది” అన్నాడు మేనేజర్ చిరునవ్వుతో.

“నేను పదేళ్ళనుంచీ మీ కష్టమర్ని సార్! ఇలాంటి కష్ట సమయంల మదద్ జేయకుంటే ఎట్ల సార్? మీ సేవకోసమే మా బ్యాంక్ అని టీవీలో పబ్లిసిటీ గూడా జేస్తున్రుగదా్సర్”

“మీ సేవకోసమే మా బ్యాంక్ అన్న మాట నిజమేగానీ, గోల్డ్ లోన్ ఇవ్వం”

“పోనీ ఓడీ ఇస్తారా?”

“ఇవ్వం”

"పోనీ ఇంకేదయినా లోన్ ఇస్తారా?"

"ఏదీ ఇవ్వం"

"ఐనాగానీ మీసేవ కోసమే మా బ్యాంక్ అని పేపర్లో వేయిస్తారు"

"ఔను. మేముందందుకే మరి"

"ఆ విషయం న్యూస్ పేపర్లలోనూ, టీవీలోనూ, రేడియోలోనూ పబ్లిసిటీ చేసేందుకు అయ్యే ఖర్చు మా లాంటివాళ్లు బోలెడుమంది నిజమైన సేవచేసేందుకు ఉపయోగపడుతుంది కదా?"

"పడుతుందిగానీ, పబ్లిసిటీ కోసం బడ్జెట్‌లో ఎక్కువ మొత్తాన్ని కేటాయించడం వల్ల అవి దానికే ఖర్చుచేయాలిగానీ, ఇంకొక హెడ్‌కి ఖర్చు చేయగూడదని స్ట్రిక్ట్ ఇన్‌స్ట్రక్షన్స్ ఉన్నాయ్"

రామ్‌గోపాల్, ప్రసూనాంబ లేచి నిలబడ్డారు.

"పద పోదాం! వీళ్ళు చేసేది సేవకాదు. కస్టమర్ల భరతం పడ్తారు" అన్నాడు రాంగోపాల్.

"మీకే సహాయం కావాలన్నా ఎప్పుడూ మా బ్యాంక్‌ని గుర్తుంచుకోండి. కేవలం ప్రజలను సేవించటమే మా ధ్యేయం" చిర్నవ్వుతో అన్నాడు మేనేజర్.

"అదేమిటి? ఇప్పుడేగా మాకెలాంటి సహయమూ చేయలేను అన్నారు?"

"ఇది కర్టెసీ వీక్‌లెండి. కస్టమర్స్‌తో చాలా వినయ విధేయతలతో లౌక్యంగా, ప్రేమగా మాట్లాడాలని చాలా స్ట్రిక్ట్ ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చాయ్ నిన్నే- కర్టసీ వీక్ కోసం రెండొందల కోట్ల బడ్జెట్ కూడా ఇచ్చారు."

ఇద్దరూ నగలన్నీ తీసుకెళ్ళి మార్వాడీ దగ్గర వందకు నెలకు ఐదు రూపాయల వడ్డీకి తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నారు.

ఇంటి పని మరికొంత జరిగి మళ్ళీ ఆగిపోయింది. రామ్‌గోపాల్ స్నేహితులందర్నీ అప్పు అడిగాడు. అందరూ "నెలరోజుల క్రితం అడిగితే ఇచ్చి వుండేవాళ్ళ" అన్నారు. మరికొంతమంది "నిన్న ఎందుకడగలేదు?" అన్నారు.

"సాయంత్రమయ్యేసరికి కూలివాళ్ళు కూలీకి వస్తారండీ! ఏమిటి చేయడం?" అంది ప్రసూనాంబ ఆందోళనగా. రామ్‌గోపాల్‌కేమీ తోచలేదు. ఇద్దరికి ఆపూట ఆకలి కూడా వేయలేదు. అందుకని భోజనం చెయ్యలేదు.

"పోనీ మన టీవీని అమ్మేసేద్దామా?" అడిగాడతను.

ప్రసూనాంబ విరుచుకుపడింది.

"ఎన్నో అవస్థలుపడి వాయిదాల పద్ధతిలో కొనుక్కున్నాం! ఇప్పుడు దానిని అమ్మేస్తే ఇంకెప్పటికీ కొనలేము. నా శవం మీద నుంచే ఆ టీవీని తీసుకెళ్ళాల్సి ఉంటుంది"

అంది.

మరో గంట తర్వాత ఆమే అతనికి సాయంపట్టి టీవీని ఆటోలోకి చేర్చింది.

రెండు రోజులు మరికొంత పని జరిగింది. మూడో రోజు పెళ్ళయిన కొత్తలో ప్రసూనాంబ మీద ప్రేమతో రామ్‌గోపాల్ కొనిచ్చిన టేప్ రికార్డర్ అమ్మేశారు. ఆ తరువాతి వారంలో డైనింగ్ టేబిల్‌ని పక్కింటి వాళ్ళే కారుచవకగా కొనేసుకున్నారు.

మర్నాడు ఆ పక్క కాలనీలోని ముసలాళ్ళు ఇద్దరు వచ్చారు వాళ్ళింటికి.

"మీరు ఇళ్ళు కడుతున్నారని తెలిసింది. సాధారణంగా ఇల్లు కట్టే వాళ్ళ సామాన్లన్నీ అమ్మేస్తూంటారని మాకు తెలుసు. అందుకే ఏమయినా సామాను అమ్మితే చౌకగా కొనుక్కెళదామని వచ్చాం" అన్నారు వాళ్ళు.

రామ్‌గోపాల్ ప్రసూనాంబ వేపు చూశాడు.

ప్రసూనాంబ ఇల్లంతా కలయజూసింది.

"మనం కొద్దిరోజుల చాపమీద పడుకుందాంలెండి" అంది డబుల్ కాట్‌వైపు చూస్తూ.

ఆ మంచాలు రెండూ రిక్షాలో తీసుకు వెళ్ళిపోయారు ఆ ముసలి వాళ్ళు.

ఆ మర్నాడు సాయంత్రం రామ్‌గోపాల్ ఇంటికి తిరిగొస్తుంటే, తమ ఇంటిలోనుంచి ఓ వ్యక్తి తమ బొచ్చు కుక్కపిల్లను చంకలో పెట్టుకొని తీసుకెళ్లడం కనిపించింది.

ఛటుక్కున అతని చొక్కా పట్టుకున్నాడు రామ్‌గోపాల్.

"మా కుక్క పిల్లను ఎత్తుకుపోతున్నావ్ కదూ?"

"కాదండీ! మీ మిసెస్ దీనిని ఆరువందలకు మాకు అమ్మేశారు"

రామ్‌గోపాల్‌కి కోపం చచ్చిపోయింది.

నీరసంగా ఇంట్లోకి చేరుకున్నాడు.

ఓ పక్క పిల్లలు ఏడుస్తున్నారు.

"మాకా పాడు ఇల్లు వద్దు. జూలీయే కావాలి" అంటూ.

ప్రసూనాంబ మరోపక్క ఓ ముసలతనితో మాట్లాడుతోంది. "ఇల్లంతా చూశానమ్మా! మీరు చేసిన తప్పేమిటంటే ఈస్ట్‌లో ఖాళీస్థలం ఎక్కువ వదల్లేదు. అందుకనే మీ ఇల్లు పూర్తికావటంలేదు" అన్నాడతను. అంటే మేమేం చెయ్యాలంటారు?"

"బాత్రూమ్ ఒకటుందికదా! అడి పడగొట్టేయండి"

మర్నాడే బాత్‌రూమ్‌ను పడగొట్టేశారు వాళ్ళు.

ఆ రోజు ఇంకో వాస్తుశాస్త్రజ్ఞుడిని ఖమ్మంనుంచి తీసుకొచ్చాడు ప్రసూనాంబ తండ్రి. అతను ఇల్లంతా చూసి "ఇరవై నాలుగు గంటల్లో మెట్లు పడగొట్టేయకపోతే ఇంటి ఓనరు రా" అన్నాడు.

"ఈ నిజామాబాదోళ్ళు అంతేనమ్మా! అన్నీ ప్రాణాలమీదికి తెచ్చుకుంటారు" అన్నాడాయన.

ఆ రాత్రి నిజంగానే జ్వరం వచ్చింది రామ్‌గోపాల్‌కి. జ్వరం వెంటనే తగ్గితే మెట్లు పడగొట్టేస్తానని వెంకటేశ్వరస్వామికి మొక్కు కుంది ప్రసూనాంబ. తెల్లవారేసరికి అతని జ్వరం తగ్గిపోయింది. వెంటనే మెట్లు పడగొట్టించడానికని ఇంటిదగ్గరికి చేరుకునేసరికి ఆ దారిన వెళుతున్న మరో వాస్తుశాస్త్ర విశారదుడు లోపలికొచ్చి "మెట్లు అలా ఉండడం వల్లే మీరు బతికి బయటపడ్డారు లేకపోతే ఎగిరిపోయేవారే" అన్నాడు.

"అట్లనా? అయితే మరి మేము ఇల్లు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నాం?" అనడిగాడు రామ్‌గోపాల్.

"ముందు హాల్లో దోషం వుంది మెయిన్‌డోర్ గోడతో మూసి పారేసేయండి"

"మరి హాల్లోంచి బయటకు వెళ్ళేదెలా?"

"వంటింట్లో నుంచి రాకపోకలు పెట్టుకోండి!"

"అదేమిటి? ఇంటి వెనుక నుంచా?"

"అవును– అలా చేయకపోతే ఇంటావిడ ఠా!" అన్నాడతను.

ఆ రాత్రి ప్రసూనాంబకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే రామ్‌గోపాల్ ఆ హాల్ మొత్తం మూసివేస్తానని యాదగిరి గుట్ట నర్సింహుడికి మొక్కుకున్నాడు. తెల్లారేసరికి రామ్‌గోపాల్ తండ్రి నిజామాబాద్ నుంచి మరో వాస్తు శాస్త్రజ్ఞుడిని తీసుకొచ్చాడు.

"బెడ్‌రూమ్ పడగొట్టేసి, అక్కడ పూజ గది కట్టండి" అన్నాడతను. "అలా చేయకపోతే భార్యభర్తలు ఇద్దరూ ఠా" అన్నాడు అతను.

రామ్‌గోపాల్‌కి పిచ్చెక్కిపోయినట్లయింది.

ఆ రాత్రి ప్రసూనాంబ భోరున ఏడ్చేసింది.


"మా నాన్నగారు ముందే చెప్పారండీ, నిజామాబాద్ జిల్లా వాళ్ళు వట్టి ఆరంభ శూరులు, ఏ పని పూర్తిగా చేయరు అని" అందామె.

రామ్‌గోపాల్‌కు కోపం వచ్చింది. ఆమె చెంప చెళ్ళుమనిపించాడు.

ప్రసూనాంబ మళ్ళీ అతని చెంప ఛెళ్ళుమనిపించింది.

"నిజామాబాద్ జిల్లా వాళ్ళు ఇలా పెళ్ళం మీద చేయి చేసుకున్నప్పుడు తిరిగి చేయి చేసుకోవాలని కూడా మా నాన్నగారు అప్పుడే చెప్పారు."

ఆ మర్నాడు ఉదయం ఏడు గంటలకు ఖమ్మం జిల్లా భార్య, నిజామాబాద్ జిల్లా భర్త గేటు దగ్గర నిలబడి న్యూస్ పేపర్ కుర్రాడు విసిరేసిన న్యూస్ పేపర్ని అమాంతం అందుకుని ఆత్రుతగా "అమ్మకాల' పేజీ చూశారు.




"ఇంచుమించుగా కట్టడం పూర్తయిన, అందమయిన ఇల్లు అమ్మకానికి వుంది. వాస్తుశాస్త్రం, తర్కశాస్త్రం, ఇంకా అయిదారు పేరు తెలీని శాస్త్రాలకు అనుగుణంగా మలచబడిన ఈ ఇంటి ఓనర్లు అర్జంటుగా విదేశాలకు వెళ్ళవలసి రావడం వల్ల అతి కారుచౌకగా ఈ ఇల్లు అమ్మేయాలని నిశ్చయించుకున్నారు. కావలసినవారు వెంటనే ఈ కింది చిరునామాతో సంప్రదించవలసిందిగా కోరుతున్నాం."

ఆ ప్రకటన చూస్తూనే ఆనందంతో పొంగిపోయింది ప్రసూనాంబ.

"ఏవండోయ్! చూశారా! ఇదిగో ఎంత బాగుందో మన ఇంటి ప్రకటన!" అంది తన్మయత్వంతో. రామ్‌గోపాల్ మనసు కూడా ఆ ప్రకటన చూసి ఊరడిల్లింది.

"మనం మనుషులుగా బ్రతకినికి అవసరమయిన వస్తువులన్నీ మళ్ళీ కొనుక్కుని ఖుషీగా కలో గంజో తాగి ఇజ్జత్‌తోటి జిందగీ గుజరాయిద్దాం ప్రసూనా! ఈ ఫాల్తూ ఇల్లు మనకొద్దు! మన్లాంటి మిడిల్ క్లాసోడికి గసంటి కలలు గిట్ట రావొద్దు" అన్నాడతను.

* * * * *